



**రంజాన్ వేళలు**

ఇఫ్తార్ : బుధవారం సా : 6.31 గం..
సహర్ : గురువారం ఉ : 5.03 గం..

పెద్దపల్లి జిల్లా మంథని మండలం కన్నాల గ్రామ శివారులోని ఇటుక బట్టీల్లో నిల్వ ఉన్న బొగ్గు (ఫైల్)



మంథనిలోని భూపాలపల్లి ఓసీపీ-1 నుంచి ఆర్‌జీ-3కు బొగ్గు లోడుతో పట్టుబడిన లారీల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు (ఫైల్)



# యథేచ్ఛగా చౌర్యం!

## కోల్‌బెల్టులో బొగ్గు మాఫియా

- సింగరేణి కళ్లు గప్పి అక్రమ వ్యాపారం
- దొడ్డిదారిన హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు రవాణా
- సింగరేణి ఖజానాకు ఏటా రూ.110కోట్లకు పైగా నష్టం?
- దందాలో అందరికీ వాటాలు!

భూపాలపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం చేతగాని తనమో.. అధికారుల లాలూచీ వ్యవహారమో తేలీదు కాని విజి'లెన్స్' కళ్లుగప్పి ఏటా వందల కోట్ల విలువైన బొగ్గు మాయమైపోతోంది. అక్రమార్కులకు కాసుల పంట పండిస్తోంది. సింగరేణి పరిధిలోని కొత్తగూడెం మొదలుకొని రామగుండం పారిశ్రామిక ప్రాంతం వరకు ఉన్న బొగ్గు గనుల ప్రాంతమంతా క్రమంగా కోల్‌స్మగ్లింగ్ మాఫియాకు అడ్డాగా మారింది. ఇందులో మరీ ముఖ్యంగా భూపాలపల్లి, బెల్లంపల్లి ఏరియాల్లోనైతే స్మగ్లింగ్ దందా అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. ఇటీవల భూపాలపల్లి ఓసీపీ-1 నుంచి రామగుండం ఆర్‌జీ-3కి రవాణా జరుగుతున్న బొగ్గును సింగరేణికి చెందిన అధికారికంగా బొగ్గు రవాణా చేసే వారే వాహనాలకు ఉన్న జీపీఎస్‌లను వేరే వాహనాలకు అమర్చి.. విజిలెన్స్‌ను ఏమార్చి దాదాపు 200 టన్నుల బొగ్గును తస్కరించిన ఘటన వెలుగులోకి రావడం ఇక్కడ జరుగున్న తతంగానికి దర్పణం పడుతోంది.

### అధిక ధరతో దొంగలకు పంట..

సింగరేణి ద్వారా విక్రయిస్తున్న బొగ్గు బహిరంగ మార్కెట్‌లో నాణ్యతనుబట్టి టన్ను రూ.2,500 నుంచి రూ.3,000 పైచిలుకు పలుకుతుండటం బొగ్గు దొంగల పంట పండుతోంది. దీంతో కొత్తగూడెం, భూపాలపల్లి, రామగుండం, బెల్లంపల్లి, సెంటినరికాలనీ, ఎన్‌టీపీసీ తదితర ప్రాంతాల్లో బొగ్గు చౌర్యం ఒక వృత్తిగా మారింది. ఇదంతా సింగరేణి అధికారుల కళ్లెదుటే జరుగుతున్నా మొద్దు నిద్ర నటిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఆదిలాబాద్ జిల్లా బెల్లంపల్లికి చెందిన ఓ వ్యాపారి ఓ అడుగు ముందుకేసి ఏకంగా కూలీలను పెట్టి మరీ బొగ్గు చౌర్యం చేయిస్తూ తాను రెండు చేతులా ఆర్జించటమే కాకుండా స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు, పోలీసులకు ముడుపులు ముట్టజెపుతూ అక్రమ వ్యాపారాలు చేస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు సింగరేణి, ఎన్‌టీపీసీ సిబ్బంది కూడా సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఫలితంగా సింగరేణి విస్తరించి ఉన్న నాలుగు జిల్లాల్లో ఏటా సంస్థ ఖజానాకు దాదాపు రూ.110 కోట్ల పైచిలుకు చిల్లు పడుతున్నట్లు అంచనా. బెల్లంపల్లి, మందమర్రి, భూపాలపల్లి, కొత్తగూడెం, ఇల్లందు ప్రాంతాల్లోనూ దాదాపు ఇదే తరహాలో బొగ్గు తస్కరిస్తున్నట్లు తెలుస్తోంది. నల్ల బంగారంగా పిలవబడుతున్న బొగ్గు అక్రమార్కులకు కాసుల పంట పండిస్తోంది.

### బడా వ్యక్తుల వెన్నుదన్నుతో..

సింగరేణి గనులు విస్తరించి ఉన్న కొత్తగూడెం నుంచి రామగుండం పారిశ్రామిక ప్రాంతం వరకు కొందరు బడా రాజకీయ నాయకులు, పోలీసు అధికారుల దన్నుతో ఝార్ఖండ్ తరహాలో మాఫియాను తలదన్నే రీతిలో ఏటా సుమారు రూ.110కోట్ల విలువైన బొగ్గు లూటీ యథేచ్ఛగా సాగుతోందన్న విమర్శలున్నాయి. ఈ తతంగంలో రాజకీయ నేతలతో పాటు సింగరేణి, నేషనల్ థర్మల్ పవర్‌స్టేషన్ సిబ్బంది, సింగరేణి సెక్యూరిటీ ఫోర్స్ సిబ్బంది పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తోంది. భూపాలపల్లి సహా ఆయా జిల్లాల్లో గడచిన కొన్నేళ్లుగా ఈ వ్యవహారం గుట్టుగా సాగుతోంది. ఇటీవల మరీ అధికంగా చౌర్యం జరుగుతున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా రామగుండం, కొత్తగూడెం ప్రాంతాల్లో రైల్వే వ్యాగన్ల నుంచే బొగ్గును తస్కరించడం ఎక్కువైపోయినట్లు తెలుస్తోంది. బొగ్గు స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న అక్రమార్కులు సగటున రోజుకు రూ.1.5 లక్షల నుంచి రూ.3లక్షల విలువైన బొగ్గు చౌర్యం కోసం కూలీలకు పెట్టుబడి పెడుతున్నట్టు తెలుస్తోంది. సుమారు 200 మంది కూలీలకు రోజుకు రూ.500 నుంచి రూ.750 కూలి చెల్లించి ఎన్‌టీపీసీకి బొగ్గు రవాణా చేస్తున్న రైల్ వ్యాగన్ల నుంచి 5 కిలోమీటర్ల పొడవునా బొగ్గును డంపింగ్ చేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రామగుండం థర్మల్ స్టేషన్‌కు విద్యుత్ ఉత్పాదన కోసం ప్రతిరోజూ సుమారు రెండు రేకులు అంటే.. 40 వేల టన్నుల బొగ్గు అవసరమవుతుంది. దానికి అవసరమైన బొగ్గు నిల్వలు రామగుండం పరిధిలోని ఓపెన్ కాస్ట్ 1, 2 ద్వారా సరఫరా చేస్తున్నారు. రోజుకు మూడు రైళ్ల ద్వారా ఈ పరిమాణాన్ని ఎన్‌టీపీసీకి రవాణా చేస్తున్నారు. అయితే అక్రమ బొగ్గు వ్యాపారంలో ఆరితేరిన బెల్లంపల్లికి చెందిన వ్యాపారి కూలీలను వినియోగించి ఎల్కలపల్లి గేట్, లక్ష్మీపూర్, సెంటినరికాలనీల్లో రైల్వే వ్యాగన్ల నుంచి బొగ్గు కిందపడేసి సంచుల్లో నింపి చెట్లపొదల్లో దాచిపెట్టి రాత్రి కాగానే బొగ్గు నిల్వలను లారీల్లోకి మార్చి రాష్ట్ర రాజధాని సమీపంలోని వివిధ రకాల పరిశ్రమలు, ఫెర్రోఅల్లాయిలకు విక్రయిస్తున్నారని తెలుస్తోంది. అదనంగా కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లోని ఇటుక బట్టీల వ్యాపారులకు టన్నుకు రూ.1,500 నుంచి రూ.1,700 చొప్పున విక్రయి స్తున్నట్లు గుర్తించారు.



మంథని-రామగుండం మధ్య వ్యవసాయ క్షేత్రంలో నిల్వ బొగ్గును సీజ్ చేస్తున్న అధికారులు (ఫైల్)

నిజానికి ఆయా సంస్థలు సింగరేణి నుంచి నేరుగా బొగ్గును కొనుగోలు చేసుకునే వెసులుబాటున్నా స్మగ్లర్లు చౌర్యం చేసిన బొగ్గు అతి తక్కువ ధరలకు లభిస్తుం డటంతో దొడ్డిదారిన వస్తున్న దానిని కొనేందుకు ఆసక్తి చూపుతున్నారని అంగున్నారు. దీంతో ఈ అక్రమ వ్యాపారం 'మూడు పువ్వులు ఆరు కాయలు' చందంగా వర్ధిల్లుతోందన్న చర్చ జరుగుతోంది. ఇందులో బెల్లంపల్లి ప్రాంతానికి చెందిన ఓ వ్యాపారి ఆరితేరాడన్న ఆరోపణలున్నాయి. ఆ వ్యాపారి తన అక్రమానికి అడ్డు తగలకుండా స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసులకు ప్రతినెలా నజరానాగా భారీ మొత్తంలో సొమ్ములు ముట్టజెబుతున్నట్టు తెలుస్తోంది. 'కంచే చేను మేసింది' అన్నట్టు సాక్షాత్తు సింగరేణికి చెందిన అధికారులకు కూడా ఈ పాపంలో వాటాలు అందు తున్నాయన్న ఆరోపణలున్నాయి. అలాగే సింగరేణి ఆస్తుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన సెక్యూరిటీ సిబ్బందికి కూడా నెలనెలా మామూళ్లు ముట్ట చెబుతున్నారన్నట్లు తెలుస్తోంది. రామగుండం ప్రాం తం లోని ఓసీపీ-2 డంప్ యార్డు నుంచే బొగ్గు చౌర్యం అధికంగా జరుగుతున్నట్టు సమాచారం. ఈ విషయం తెలిసిన సంబంధిత పోలీస్ అధికారులు గానీ, సింగరేణి యాజమాన్యం కానీ పట్టించుకునే పరిస్థితి లేదం టున్నారు. పైగా బొగ్గు అక్రమ డంపింగ్‌కు సంబంధించి ముతాల సమాచారం ముందుగానే ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహించే

మిగతా 8వ పేజీలో...

# కమలం గూటికి అరూరి

- కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ
- నేడు ఢిల్లీలో చేరికకు ఏర్పాట్లు
- అనుచరులతో సమావేశం తర్వాత రాజధానికి పయనం
- రమేష్ రాకతో బలం పెరుగుతుందని భావిస్తున్న బీజేపీ
- కడియం శ్రీహరితో టచ్‌లోకి కాంగ్రెస్?
- మారుతున్న ఓరుగల్లు రాజకీయం
- లోక్‌సభ ఎన్నికల వేళ 'గులాబీ'దళంలో అయోమయం

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన అరూరి రమేష్ కమలం గూటికి చేరడం ఖాయమైంది. ఈ క్రమంలోనే సీనియర్‌నేత, మాజీ డిప్యూటీసీఎం, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని చేర్చుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నట్టు వార్తలు రావడం.. ఇప్పటికే వరుస వలసలతో కుదేలవుతున్న బీఆర్‌ఎస్‌ను మరింత కలవరపెడుతోంది. ఆరూరి చేరికతో బలపడొచ్చన్న భావనలో బీజేపీ ఉండగా.. బీఆర్‌ఎస్‌కు ఎలాగైనా చెక్‌పెట్టాలన్న యోచనతో కాంగ్రెస్ పావులు కదుపుతుండటంతో ఓరుగల్లు రాజకీయాలు రోజురోజుకు మారుతున్నాయి. చివరగా ఏ పార్టీ నుంచి ఎవరు పోటీచేస్తారన్న దానిపై అందరిలోనూ ఉత్కంఠ కనిపిస్తోంది.

### నేడు బీజేపీలోకి..

బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బుధవారం బీజేపీలో చేరనున్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో పాటు పలువురు పార్టీ పెద్దలతో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో వరంగల్ ఎంపీ టికెట్‌పై బీజేపీ పెద్దల నుంచి హామీ పొందిన రమేష్ బుధవారం వరంగల్‌లో అనుచరులతో సమా వేశం నిర్వహించి, బీఆర్‌ఎస్‌కు రాజీనామా ప్రకటించి ఆ తర్వాత సాయంత్రానికి ఢిల్లీ వెళ్లి కాషాయ కండువా కప్పుకోబోతున్నారు. అయతే పది రోజుల కిందటే బీజేపీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్న రమేష్‌ను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు హైదరాబాద్ పిలిచి బుజ్జగించడంతో మెత్తబడిన రమేష్ తాను పార్టీ మారేది లేదని చెబుతూ వచ్చారు. కానీ అనూహ్యంగా ఆయన మంగళవారం బీజేపీ నేత అమిత్‌షాను కలవడం చర్చనీయాంశమైంది. ఇక రమేష్‌ను బీజేపీలోకి సాదరంగా ఆహ్వానించిన అమిత్‌షా వరంగల్‌లో బీజేపీ జెండా ఎగురవేయాలని, పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుందని భరోసా ఇచ్చినట్టు సమాచారం. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో పాటు పార్టీ పెద్దలను మర్యాదపూర్వకంగా కలిసే అవకాశం ఉంది. మొత్తానికి పార్లమెంట్ ఎన్నికలకు ముందు అరూరి తన 'కారు' ప్రయాణానికి ఫుల్ స్టాప్ పెట్టడం బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తుండగా.. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన అరూరి రమేష్ రాకతో తమ బలం పెరుగుతుందని బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి.

### కడియం శ్రీహరికి కాంగ్రెస్‌కు ఆఫర్..

మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాంగ్రెస్‌లోకి తీసుకవచ్చే ప్రయత్నాలు జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. వరంగల్ లోక్‌సభ నుంచి ఎంపీగా కడియం శ్రీహరిని బరిలో దించాలని కాంగ్రెస్ భావిస్తోంది. 2014లో వరంగల్ ఎంపీగా గెలిచిన కడియం శ్రీహరికి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సత్సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కడియంను కాంగ్రెస్ నుంచి బరిలో దించేందుకు సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉండే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఓ నేత ప్రయత్నాలు చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. వరంగల్ ఎంపీగా కడియం

మిగతా 8వ పేజీలో...

# ఇంటర్ పరీక్షలో మాల్‌ప్రాక్టీస్ కలకలం

భూపాలపల్లి టౌన్/కాటారం, మార్చి 12: ప్రశాంతంగా సాగుతున్న ఇంటర్ పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్ కలకలం రేపింది. మంగళవారం భూపాలపల్లి జిల్లాలో 27 మంది విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్ చూస్తూ అధికారులకు పట్టుబడ్డారు. కాటారం మండలకేంద్రంలోని రెండు పరీక్షాకేంద్రాల్లో 24 మంది విద్యార్థులు, భూపాలపల్లిలోని మైనారిటీ జూనియర్ కాలేజీలో ఇద్దరు మహ దేవపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఒకరు స్పెషల్ ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు దొరికికారు. మంగళవారం ఇంటర్ సెకండియర్ ఫిజిక్స్, ఎకనామిక్స్, వొకేషనల్ పరీక్షలు జరుగుంతడగా.. ఇంటర్ బోర్డు నుంచి వచ్చిన స్పెషల్ ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందసభ్యులు కాటారంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకులం, ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేశారు. ఈ క్రమంలో 24మంది బాలురు లోదుస్తుల్లో చీటీలు పెట్టి దొరకడంతో వారిని మాల్‌ప్రాక్టీస్ కింద బుక్ చేశారు. అయితే గిరిజన గురుకులంలో 15మంది దొరకగా వారిలో ఫిజిక్స్ పరీక్షరాస్తున్న వారు 8మంది, ఎకనామిక్స్ విద్యార్థులు ఏడుగురున్నారు. ఇక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాల్ ప్రాక్టీస్ నమోదైన 9మందిలో ఐదుగురు ఫిజిక్స్, ముగ్గురు ఎకనామిక్స్, ఒక్కరు ఒకేషనల్ పరీక్ష రాస్తున్న విద్యార్థి ఉన్నారు. వీరిపై మాల్‌ప్రాక్టీస్ బుక్‌చేశామని, దీంతో వీరికి చివరి పరీక్షను రాసే అవకాశం ఉండదని, మళ్లీ సప్లిమెంటరీలో రాసుకోవచ్చని ఇంటర్ అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే మాల్‌ప్రాక్టీస్ కింద బుక్కయిన కొందరు విద్యార్థులు మాత్రం తాము ఏతప్పు చేయలేదని, తమ వద్ద స్లిప్పులు దొరక్కపోయినా ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు తమను తనిఖీ చేసి స్లిప్స్ బయటికి తీసి మాల్ ప్రాక్టీస్ కింద బుక్ చేశారని ఆరోపించారు. ఇద్దరు ముగ్గురు విద్యార్థులు మాత్రం తాము పరీక్ష రాసే డెస్క్‌లో పరీక్షకు సంబంధంలేకుండా అంతకుముందునుంచే ఉన్న కాగితాలు, అలాగే గణితానికి సంబంధించి తమ దుస్తుల్లో తడిచిన కాగితాలు కనిపించడంతో తమను కూడా మాల్‌ప్రాక్టీస్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఎన్నడూ లేని విధంగా పరీక్ష కేంద్రాల్లో ఇలా విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్ కింద బుక్ అవడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. పరీక్షా కేంద్రాల్లో పర్యవేక్షకులు పూర్తి స్థాయిలో తనిఖీలు చేసి విద్యార్థులను అనుమతించి ఉంటే ఇలాంటివి జరిగేవి కావని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# కాళేశ్వరంలో టూరిజం అధికారుల పర్యటన



గోదావరి పరిసరాలను పరిశీలిస్తున్న టూరిజం శాఖ అధికారులు

మహదేవపూర్, మార్చి 12: కాళేశ్వరంతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో టూరిజం తరపున అభివృద్ధి చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అందులో భాగంగా టూరిజం శాఖ జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డితోపాటు ఇతర అధికారులు మంగళవారం కాళేశ్వరాన్ని సందర్శించారు. రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు తన మంథని నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించాలని ఆదేశాలను జారీ చేసిన నేపథ్యంలో అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. నలుగురు సభ్యులతో కూడిన బృందం ఆలయాలు, ఇతర ప్రాంతాలను పరిశీలించింది. అభివృద్ధిలో భాగంగా కాళేశ్వరం బస్టాండ్ నుంచి గోదావరి వరకు ఉన్న రోడ్డుకు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంతోపాటు డ్రెయినేజీలను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గోదావరి, ఆలయ సమీపంలో మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదుల నిర్మాణంతోపాటు టీటీడీ సత్రాన్ని తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ కట్టేందుకు సర్వే నిర్వహించారు. గుండం చెరువు అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించనున్నట్లు అధికారులు తెలిపారు. వారి వెంట మహదేవపూర్ తహసీల్దార్ ప్రహ్లాద్, కాళేశ్వరం హరిత హోటల్ మేనేజర్ సురేష్ ఉన్నారు.

# 'గులాబీ' కార్యకర్తలు గరంగరం?

- మాజీ మంత్రి, ఎంపీ ఎదుట అసంతృప్తి!
- పార్టీలో ఎన్నికల ఇన్‌చార్జ్ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్
- ఓటమికి 'దళితబంధు' కారణమంటూ ఆవేదన



ములుగు, మార్చి 12: అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారిగా ములుగులో మంగళవారం జరిగిన బీఆర్‌ఎస్ సమావేశంలో కార్యకర్తలు నేతలపై తమ అక్కసును వెళ్లగక్కారు. ఓటమికి కారణాలను బాహాటంగానే చర్చించారు. నేతల తీరును ఎండగట్టారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ములుగులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ములుగు, వెంకటాపూర్(రామప్ప) మండలాల కార్యకర్తల సమన్వయ సమావేశం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహరావు అధ్యక్షతన జరిగింది. మీడియాకు సమాచారం లేకుండా ఈ సమావేశాన్ని గోప్యంగా నిర్వహించారు. మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, జడ్పీచైర్‌పర్సన్ బడే నాగజ్యోతి హాజరయ్యారు. పోల్ మేనేజ్‌మెంట్ కోసమంటూ ఎన్నికల సమయంలో మండలాలకు నియమించే ఇన్‌చార్జిల వల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువగా ఉందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఈవిధానాన్ని రద్దు చేయాలని కార్యకర్తలు ఈ సందర్భంగా డిమాండ్ చేశారని సమాచారం. ఇన్‌చార్జిల ఒంటెద్దు పోకడల వల్ల తాము ఓటర్లను నేరుగా కలవలేకపోతున్నామని వెల్లడించారు. ములుగు, వెంకటాపూర్‌కు సంబంధించిన ఒకరిద్దరు నాయకుల తీరు పార్టీని డ్యామేజ్ చేస్తోందని, వారు తీరు మార్చుకోకుంటే తాము దూరంగా ఉండాల్సి వస్తుందని తేల్చిచెప్పారు. జిల్లా అధ్యక్షుడు కూడా ఒక వర్గాన్నే ప్రోత్సహిస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఒక దశలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌ను కూడా టార్గెట్ చేస్తూ కొందరు కార్యకర్తలు తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేసినట్లు తెలిసింది. మంత్రిగా ఉండి ప్రతిపక్ష ఎమ్మెల్యేకు దళితబంధు యూనిట్ల ను ఇచ్చి సొంతపార్టీ కార్యకర్తలను విస్మరించారని, అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో శ్రేణులు మనస్ఫూర్తిగా పనిచేయలేదని, ఆప్రభావంతో ఓటమి చెందాల్సి వచ్చిందని స్పష్టంచేసినట్లు సమాచారం. ఇలా నలువైపుల నుంచి కార్యకర్తలు నిరసనగ ళం ఎత్తుకోవడంతో సమావేశం రసాభాసగా మారినట్లు తెలి సింది. గత తప్పిదాలను పునరావృతం కానీయమని, పార్ల మెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించుకుని సత్తా చాటాలని కార్యక ర్తలకు సత్యవతిరాథోడ్ మాలోత్ కవిత నచ్చజెప్పినట్లు సమాచారం. సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన వివరాలను ఎక్కడా బహిర్గతం చేయవద్దని ముందే కార్యకర్తలకు సూచించడంతోపాటు ఫొటోలు, వీడియోలు తీయకుండా నియంత్రించారు. అయినప్పటికీ ఇన్నాళ్లు కార్యకర్తలు తమ మనసులో దాచుకున్న అసంతృప్తినంటా వెళ్లగక్కారు.

# 'కోటంచ' ఆదాయం రూ.11.58 లక్షలు



కోటంచ ఆలయ హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

రేగొండ, మార్చి 12: మండలంలోని ప్రసిద్ధ కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. మొత్తం రూ. 11,50,011 ఆదాయం సమకూరిందని ఈవో శ్రీనివాస్ తెలిపారు. వీటిలో రూ.10,99,235 కరెన్సీ నోట్లు రాగా, నాణేలు రూ. 58,776 వచ్చాయని పేర్కొన్నారు. హుండీల లెక్కింపునకు పర్యవేక్షణాధికారిగా అనిల్ కుమార్ వ్యవహరించారని తెలియజేశారు.

# హిమాలయాల కంటే పూర్వం నుంచే పాండవుల గుట్టలు

**భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా**





హెరిటేజ్ వాక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

రేగొండ, మార్చి 12: హిమాలయాల కంటే పూర్వమే రేగొండ మండలంలోని పాండవుల గుట్టలు ఏర్పడినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. మండలంలోని రావులపల్లి శివారు పాండవుల గుట్టలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం హెరిటేజ్ వాక్‌ను నిర్వహించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా జియో హెరిటేజ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ పురాతన వారసత్వ ప్రాంతాలు గుర్తించే ప్రక్రియను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా చేపట్టిందన్నారు. దేశంలో 90 ప్రాంతాలను హెరిటేజ్ ప్రదేశాలను గుర్తించిందన్నారు. ఇందులో తెలంగాణ నుంచి ఒక్క పాండవుల గుట్టలు మాత్రమే ఎంపికైందని తెలిపారు. జియో హెరిటేజ్ గుర్తింపు రావడం వల్ల పాండవుల గుట్టలకు పర్యాటకుల సందర్శన పెరుగుతుందన్నారు. ఈ క్రమంలో ఈ ప్రాంతాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి చేస్తాయన్నారు.

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ పాండవుల గుట్టల్లో పాండవులు నివసించినట్టు చారిత్రక ఆధారాలు ఉన్నాయన్నారు. అనంతరం వారిని ఆదర్శంగా తీసుకుని రాష్ట్రకూటులు నివసించారని తెలిపారు. 168 కోట్ల సంవత్సరాల క్రితం ఇసుక రేణువులతో ఏర్పడిన పాండవుల గుట్టలు 3 నుంచి 7 కిలోమీటర్లు విస్తరించి ఉన్నాయన్నారు. క్రీస్తు పూర్వం 10వేల సంవత్సరాల క్రితం ఆదిమానవులు గీసిన రాతి చిత్రాలు ఎంతో అద్భుమని అన్నారు. ఈ ప్రాంతం విశిష్టతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో వసంత, శాస్త్రవేత్త సామల రమేష్, ఎంపీపీ పున్నం లక్ష్మి, ఎఫ్‌ఎస్‌వో ప్రసాద్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహార లోపాన్ని నివారించడమే లక్ష్యం

కాటారం, మార్చి 12: గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోప నివారణే పోషణ్ అభియాన్ లక్ష్యమని ఐసీడీఎస్ మహదేపూర్ సీడీపీవో రాధిక అన్నారు. మండలంలోని గంగారం, కాటారం ఐసీడీఎస్ సెక్టార్ల పరిధిలోని రేగులగూడెం, మేడిపల్లి జీపీల పరిధిలోగల దేవరాంపల్లి, మేడిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ్ అభియాన్ పక్షోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. సుపోషణ దివస్‌పై అవగాహన సమావేశాలు, ర్యాలీలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు పలు రకాల పండ్లు, కూరగాయలను ప్రదర్శిస్తూ వాటితో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా సీడీపీవో రాధిక, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు వీణ, అరుణ పెరటి తోటల పెంపకం, పౌష్టికాహార ఆవశ్యకత, చిరుధాన్యాలతో వంటలతోపాటు గర్భిణులు, బాలింతలకు వెయ్యి రోజుల ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు, పిల్లల్లో రక్తహీనత, లోప పోషణ లేకుండా ఆకుకూరలు, పాలు, గుడ్లు వంటి సమతుల ఆహారాన్ని తీసుకోవాలన్నారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జీపీ కార్యదర్శి కృష్ణవేణి, పాఠశాల ఉపాధ్యాయులు స్రవంతి, లక్ష్మి, మదర్స్ కమిటీ చైర్మన్ శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు కమలాదేవి, అన్నపూర్ణ, ప్రమీల, దివ్య, రోజా, శ్యామల, ఏఎన్‌ఎంలు, హెచ్‌లు రజిత, సునిత, మహిళలు పాల్గొన్నారు.

- వెంకటాపూర్(రామప్ప): పోషణపక్షలో భాగంగా మండలంలోని మైనారిటీ వెల్ఫేర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు పోషణ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం జరిగింది. మైనారిటీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఈపీ.ప్రేమలత మాట్లాడుతూ కిషోర బాలికలు ఎక్కువ రక్తహీనతతో బాధపడుతున్నారని, వారికి సమతుల ఆహారం అందించాలని అన్నారు. ముఖ్యంగా ఐరన్ లభించే ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ వందన, సీడీపీవో కె.స్వాతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, డీహెచ్‌ఈడబ్ల్యూ శిరీష పాల్గొన్నారు.

**ప్రకటన**

ఎరుకల గణపతి, S/o. రాజయ్య, జవహర్ కాలనీ, భూపాలపల్లి, జిల్లా జయశంకర్ భూపాలపల్లి. పాలవేణి గణపతి S/o. రాజయ్య ఒకరే అని తెలియజేస్తున్నాం. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలుపగలరు.

సం/- శ్రీనివాస చారి
అడ్వకేట్, భూపాలపల్లి.

# ఎన్‌పీడీసీఎల్ ఈఈలు (సివిల్) బదిలీ

హనుమకొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్లుగా తెలంగాణ రాష్ట్ర నార్తరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ ఎన్‌పీడీసీఎల్) కార్పొరేట్ కార్యాలయానికే పరిమితమైన సివిల్ ఎగ్జిగ్యూటివ్ ఇంజనీర్లు (ఈఈ)లకు ఎట్టకేలకు విముక్తి లభించింది. వారు తిరిగి క్షేత్రస్థాయికి వెళ్లి విధులు నిర్వహించే అవకాశం ఏర్పడింది. కార్పొరేట్ ఆఫీసులోని ఐదుగురు సివిల్ ఈఈలను సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కార్పొరేట్ ఆఫీసులో సీజీఎం పరిధిలో పనిచేస్తున్న ఈఈ (సివిల్) వెంకటేశ్వర్‌ను హనుమకొండ హెడ్‌క్వార్టర్‌లో ఎస్ఈ ఆపరేషన్‌కు మార్చారు. ఈయన హనుమకొండ, వరంగల్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ సర్కిళ్ల పరిధిలోని సివిల్ పనులను పర్యవేక్షిస్తారు.

ఇదే కార్పొరేట్ ఆఫీసులో సీజీఎం (ఆపరేషన్-1) పరిధిలో పనిచేస్తున్న మరో ఈఈ (సివిల్) కె.శ్రీనివాస్‌ను కరీంనగర్ హెడ్‌క్వార్టర్ ఎస్ఈ ఆపరేషన్ ఆఫీసుకు స్థాన చలనం చేశారు. ఈయన కరీంనగర్, జగిత్యాల, పెద్దపెల్లి ఆపరేషన్ సర్కిళ్ల పరిధిలోని విద్యుత్ సివిల్ పనులను చూస్తారు. కార్పొరేట్ ఆఫీసులో సీజీఎం (ఆపరేషన్-11) కింద పని చేస్తున్న ఈఈ (సివిల్) జి వెంకటేశ్వర్లును ఖమ్మం హెడ్‌క్వార్టర్‌లోని ఎస్‌సీ (ఆపరేషన్) కార్యాలయానికి డైవర్ట్ చేశారు. ఈయన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం ఆపరేషన్ సర్కిళ్లను పర్యవేక్షిస్తారు. కార్పొరేట్ ఆఫీసులో సీఈ కన్‌స్ట్రక్షన్ ఆఫీసులో పని చేస్తున్న ఈఈ (సివిల్) కోమిరెడ్డి స్వామిని నిజామాబాద్ ఎస్ఈ (ఆపరేషన్) ఆఫీసుకు మార్చారు. ఆయన నిజామాబాద్ కామారెడ్డి సర్కిళ్లను, అలాగే కార్పొరేట్ ఆఫీసులో ఎస్ఈ/క్యూసీ అండ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో పని చేస్తున్న ఈఈ (సివిల్) పి.జానార్దన్‌రావును ఆదిలాబాద్ జిల్లా ఎస్ఈ ఆఫీసుకు బదిలీ చేశారు.

ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని ఆయా జిల్లాల్లో క్షేత్రస్థాయిలో సివిల్ పనులను పర్యవేక్షించాల్సిన వీరిని గత సీఎండీ గోపాల్‌రావు ఏడేళ్ల కిందట కార్పొరేట్ ఆఫీసుకు తీసుకువచ్చారు. దీనితో వీరికి పనిలేకుండా పోయింది. కొత్త సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన కర్నాటి వరుణ్ రెడ్డి ప్రక్షాళన చేపట్టారు. కార్పొరేట్ ఆఫీసులోని ఈఈ (సివిల్)లను ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని ఆయా జిల్లాల సర్కిళ్లకు పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# మండలాధ్యక్షులపై అవిశ్వాసాలు పెట్టొచ్చు

- నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోలకు ఉంది
- హైకోర్టు స్పష్టీకరణ .. పలువురి దావాల కొట్టివేత

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు వ్యతిరేకంగా వచ్చిన అవిశ్వాస తీర్మానాలపై సమావేశాలు నిర్వహించే అధికారం ఆర్డీవోలకు ఉందని హైకోర్టు తేల్చిచెప్పింది. పలు మండలాల అధ్యక్షులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. తమకు వ్యతిరేకంగా అవిశ్వాస సమావేశాలు నిర్వహించేలా ఆర్డీవోలు నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ ఎంపీపీ ఉమాదేవి, రామన్నపేట్ ఎంపీపీ జ్యోతి, మద్నూర్ ఎంపీపీ లక్ష్మీబాయి, రామారెడ్డి ఎంపీపీ దశరథ్‌రెడ్డి, వరంగల్ జిల్లా గీసుకొండ ఎంపీపీ సౌజన్య, రంగారెడ్డి జిల్లా మర్రిగూడ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సరూర్‌నగర్ ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, నల్లగొండ జిల్లా చండూర్ ఎంపీపీ పల్లె కల్యాణి, కరీంనగర్ జిల్లా రామడుగు ఎంపీపీ కలగంటి కవిత, ఆదిలాబాద్ జిల్లా ఏలూరు సారంగాపూర్ మండల ఉపాధ్యక్షుడు, జనగాం జిల్లా మల్యాల ఎంపీపీ విమల, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ ఎంపీపీ సువర్ణ, డిచ్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలానికి చెందిన సుజాత, ప్రభాకర్ తదితరులు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఆర్డీవోల నుంచి తమకు అవిశ్వాస నోటీసులు అందాయని, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 263 ప్రకారం ఆ నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోకు లేదని పేర్కొన్నారు. ఈ నోటీసులను కొట్టివేయాలని కోరారు. విచారణ చేపట్టిన జస్టిస్ కే శరత్ ధర్మాసనం నోటీసులు జారీ చేసే అధికారం ఆర్డీవోలకు ఉందని తెలిపింది. సాంకేతిక కారణాలు చూపించి అవిశ్వాసాన్ని తప్పించుకోలేరని పేర్కొంది.

# గుదిబండగా కరెంటు ఒప్పందాలు

**ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తును వాడకున్నా.. రూ.వందల కోట్లలో బిల్లుల బకాయిలు.. న్యాయ విచారణకు సర్కారు నిర్ణయం**

- జస్టిస్ నర్సింహారెడ్డితో కమిషన్
- యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లపైనా విచారణ



హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గుదిబండగా మారిన ఛత్తీస్‌గఢ్ కరెంటు ఒప్పందాల దుమ్మును దులపాలని రేవంత్‌రెడ్డి సర్కారు నిర్ణయించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటును కొనుగోలు చేయకున్నా.. ప్రస్తుతం ఒక్కయూనిట్ సరఫరా లేకున్నా.. వేల కోట్లలో బిల్లులు కట్టాల్సి రావడంపై న్యాయ విచారణకు ఆదేశించింది. ఇందుకోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డితో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అంతేకాదు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లపైనా ఈ కమిషన్ విచారణ జరుపుతుంది.

### ఇదీ ఛత్తీస్‌గఢ్ కరెంటు కథ?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక.. విద్యుత్తు అవసరాలను తీర్చాలనే ఉద్దేశంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 2015 సెప్టెంబరు 22న ఛత్తీస్‌గఢ్‌లోని 1,000 మెగావాట్ల మార్వా ప్లాంట్ నుంచి 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందాలను కుదుర్చుకుంది. ఈ మేరకు పీపీఏ కింద తెలంగాణ డిస్కమ్‌లు, సీఎస్‌పీడీసీఎల్(ఛత్తీస్‌గఢ్) ఒప్పందాలపై సంతకాలు చేశాయి. అప్పట్లోనే విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ అభ్యంతరాలు వ్యక్తం చేసినా.. ప్రభుత్వం కౌంటర్ సమర్థనలను చేయిస్తూ.. ముందుకెళ్లింది. ఇక ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటు సరఫరాకు వీలుగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్(పీజీసీఐఎల్)తోనూ ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ కరెంటును కొనుగోలు చేయకపోవడంతో.. పెనాల్టీ కింద రూ.300 కోట్లను పీజీసీఐఎల్‌కు చెల్లించాలని కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి(సీఈఆర్‌సీ) ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు.. బకాయిల పేరుతో మార్వా ప్లాంట్ నుంచి విద్యుత్తు సరఫరా జరగకున్నా.. పాయింట్ ఆఫ్ కనెక్షన్ చార్జీలు(పీవోసీ) రూపంలో ఏటా రూ.400 కోట్ల నుంచి రూ.450 కోట్లను చెల్లించాల్సి వస్తోంది. స్థిర చార్జీల భారం కూడా తెలంగాణ డిస్కమ్‌లను వీడడం లేదు. 2020-21లో రూ.828.13 కోట్లు, 2021-22లో రూ.394.98 కోట్ల మేర స్థిరచార్జీలను చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం కాస్తా లేట్‌పేమెంట్‌తో కలుపుకొని రూ.3,576.89 కోట్లకు పెరిగినట్లు ఛత్తీస్‌గఢ్ చెబుతుండగా.. అది కేవలం రూ.2,100 కోట్లేనని తెలంగాణ డిస్కమ్‌లు వాదిస్తున్నాయి. కరెంటు బిల్లుల బకాయిలున్నాయంటూ రెండేళ్ల క్రితమే ఛత్తీస్‌గఢ్ కరెంటు సరఫరా నిలిచిపోయింది. నిజానికి తెలంగాణ డిస్కమ్‌లు 2021-22లో 1,631 మిలియన్ యూనిట్లు(కేవలం 19%) కొనుగోలు చేశాయి. 2022-23 ద్వితీయార్థంలో 2,713 మిలియన్ యూనిట్ల(31%) విద్యుత్తును కొనాలని అంచనాలు వేసినా.. ఆ పరిస్థితి లేదని తేలిపోయింది. 2023-24లో 78% విద్యుత్తు కొంటామనే అంచనాలున్నాయి. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు బకాయిల పేరుతో ఆ మేరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేశాయి. రెండేళ్లుగా కరెంటు సరఫరా లేకున్నా.. 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలు ఒప్పందం బూచీగా ఇప్పుడు తెలంగాణ డిస్కమ్‌లపై భారం పడే ప్రమాదం ఉంది. ఒప్పందంలో ఇంకా ఆరేళ్లు మిగిలే ఉన్నాయి. పీపీఏ ఒప్పందం ప్రకారం విద్యుత్తును కొనకుంటే.. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు ఆ కరెంటును ఓపెన్‌యాక్సెస్‌లో విక్రయించుకోవచ్చు. ఒకవేళ తెలంగాణ ఒప్పందం కంటే.. ఓపెన్‌యాక్సెస్ విక్రయం తక్కువ ధరలో ఉంటే.. ఆ భర్తీని తెలంగాణ డిస్కమ్‌లు పూడ్చాల్సి ఉంటుంది. ఇప్పుడు ఈ బకాయిలన్నీ తెలంగాణ డిస్కమ్‌ల పాలిట గుదిబండగా మారాయి. దీనిపై తెలంగాణ డిస్కమ్‌లు 2018లో విద్యుత్తు అప్పిలేట్ ట్రైబ్యునల్(అప్టెల్)ను ఆశ్రయించినా.. ఆ కేసు తేలేదాకా ఇబ్బందులు తప్పేలా లేవు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన ఈ తొందరపాటు ఒప్పందాలపై ఇప్పుడు రేవంత్ సర్కారు విచారణ జరిపించనుంది. మరోవైపు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లను వినియోగించుకోవాలా? వదిలేయాలా? అంటూ ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. భద్రాద్రిలో ఒక్కో ప్లాంట్ 270 మెగావాట్ల సామర్థ్యంతో.. మొత్తం నాలుగు ప్లాంట్లు 1,080 మెగావాట్లను ఉత్పత్తి చేస్తాయి. ఈ ప్లాంట్‌పై అప్పట్లోనే తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ అందుబాటులో ఉన్నా.. సబ్-క్రిటికల్ టెక్నాలజీతో ప్లాంట్ కట్టడంపై నిపుణులు విమర్శలు చేశారు. 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో యాదాద్రి ప్లాంట్ ఇంకా నిర్మాణంలోనే ఉంది. ఇక్కడ కూడా భూసేకరణ, టౌన్‌షిప్‌ల నిర్మాణం, సబ్-కాంట్రాక్టుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ అంశాలపైనా జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణ జరపనుంది.

# ఫలించిన 15 ఏళ్ల నిరీక్షణ

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల డీఎస్సీ 2008 అభ్యర్థుల హర్షం
- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరిగిందని ఆనందం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2008లో అర్హత పొంది, నియామకాలు పొందని అభ్యర్థులకు కనీస వేతనాల పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తాము 15 ఏళ్లుగా పడుతున్న కష్టాల నుంచి ప్రభుత్వ ప్రకటనతో ఉపశమనం కలిగిందన్నారు. మంగళవారం సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద అభ్యర్థులు, అసోసియేషన్ ప్రతినిధులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... దశాబ్దంనర కాలంగా ఎదురుచూపులు నేడు ఫలించాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో తమకు న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి, తమకు కాంట్రాక్ట్ పద్ధతిలో అయినా ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకొచ్చినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తమకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో పాటు ఇతర అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. త్వరగా విధివిధానాలు ప్రకటించాలని వారు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 'డీఎస్సీ 2008 అసోసియేషన్' అధ్యక్షుడు ఉమామహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# మాకు ఉద్యోగాలు ఇవ్వండి

- డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ టీచర్ల మొర
- వేర్వేరు సమస్యలపై 'ప్రజావాణి'కి 1470 అర్జీలు



పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న బాలుడు గౌతమ్

సికింద్రాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తమకు తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలంటూ డీఎస్సీ 1998లో అర్హత సాధించిన ఉపాధ్యాయులు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. 1998 డీఎస్సీలో నియామక ప్రక్రియ లోపభూయిష్టంగా జరిగిందని, ఎన్నికలు రావడంతో 1999లో డీఎస్సీ ప్యానల్‌ను రద్దు చేశారన్నారు. దాంతో డీఎస్సీ-98లో క్వాలిఫై అయిన అభ్యర్థులు ఉద్యోగావకాశాలు కోల్పోయారని తెలిపారు. ఈ మేరకు ప్రజాభవన్‌కు తరలివచ్చిన పలువురు అభ్యర్థులు ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నారు. ఇదే కాదు.. రేషన్ కార్డులు, పెన్షన్లు, ధరణి సమస్యలు, ఉద్యోగాలు, వైద్యంతోపాటు వేర్వేరు సమస్యలపై ప్రజావాణికి మంగళవారం 1,470 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ పరమైన సమస్యలు 327, ఇంటి కోసం 251, పంచాయతీరాజ్ విభాగానికి 200, మైనార్టీ వెల్ఫేర్ సంబంధించి 145అర్జీలు ఉన్నాయి. ఆయా దరఖాస్తులను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జీ.చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య, ఇతర అధికారులు ప్రజలను స్వీకరించారు. సంబంధిత విభాగాల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, పుట్టుకతో అంగవైకల్యంతో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేయాలని నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన దండు గౌతమ్ (13) దరఖాస్తు చేసుకున్నాడు. ఆరో తరగతి విద్యార్థి అయిన గౌతమ్ లేచి నిలబడాలన్నా, కూర్చోవాలన్నా ఇతరులపై ఆధారపడే స్థితిలో ఉన్నాడు. అలాగే, రైలు ప్రమాదంలో తగిలినగాయాల వల్ల తన కాలు, చెయ్యి పని చెయ్యడం లేదని, ఆర్థిక సమస్యల్లో ఉన్న కుటుంబాన్ని పోషించుకునేందుకు తనకు ఉద్యోగం ఇప్పించాలని నాంపల్లి నేతాజీనగర్‌కు చెందిన జి.శశికాంత్ దరఖాస్తు చేసుకున్నారు. ఉప్పల్‌కు చెందిన పలువురు వృద్ధ మహిళలు తమకు పెన్షన్ మంజూరు చేయాలని, అంబర్‌పేటకు చెందిన పలువురు మహిళలు రేషన్ కార్డు కోరుతూ అర్జీలు పెట్టారు. కాగా, తమ ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించాలని, వేతనాన్ని రూ.19,500కు పెంచాలని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్ టైమ్ స్వీపర్లు అర్జీ చేసుకున్నారు. గత ప్రభుత్వం తీరు వల్ల 1500 మంది అభ్యర్థులు ఉద్యోగాలు లేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన జూనియర్ లైన్‌మెన్లు అభ్యర్థించారు. బేగంపేట్‌లోని ఈశ్వరీయ విశ్వ విద్యాలయ కేంద్రంలో నిర్వహించే ఆధ్యాత్మిక తరగతులకు తమ ను రానివ్వడం లేదంటూ పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు.



అంటువ్యాధుల నివారణ కోసం నిర్మించబోయే ప్రయోగశాల భూమిపూజలో పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు

# అంటువ్యాధుల నివారణకు ప్రయోగశాల

- 25 కోట్లతో ఐఐపీహెచ్ ఆవరణలో ఏర్పాటు
- హిమాయత్‌సాగర్‌లో భూమిపూజ
- భవిష్యత్‌లో పలు పరిశోధనలు

రాజేంద్రనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అంటువ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు హిమాయత్‌సాగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఐఐపీహెచ్) ఆవరణలో రూ.25 కోట్లతో ప్రయోగశాల(సైరస్ పూనావాలా సెంటర్ ఫర్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ అండ్ పాండమిక్ ప్రిపేర్డ్‌నెస్) నిర్మించనున్నట్లు ఐఐపీహెచ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ మధుబాల రెంటల తెలిపారు. ఈ సెంటర్‌కు భూమిపూజను విల్లో పూనావాలా ఫౌండేషన్ సీఈవో జస్వీందర్ నారంగ్, ఇంటర్నేషనల్ పబ్లిక్ హెల్త్ సొసైటీ ఛైర్మన్ సి. శ్రీనివాస రాజు, ఐఐపీహెచ్ చీఫ్ మెంటార్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సంజయ్ జొడెపె, యూఎస్‌ఏకు చెందిన డాక్టర్ అనిల్ కౌల్‌తో కలిసి మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ సెంటర్ అంటువ్యాధులను ఎదుర్కోవడానికి అంకితమైన మార్గదర్శక కేంద్రంగా పనిచేస్తుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలను సూచించడంలో ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ వారు క్యాన్సర్ స్క్రీనింగ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో సుమారు రూ.10 కోట్ల విలువ చేసే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే బస్సును ఐఐపీహెచ్‌కు బహూకరించారు. ఈ బస్సులో ఇక మీదట గ్రామాల్లో తిరుగుతూ మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

# మూడు బోర్లు వేసి అప్పుల పాలై రైతు ఆత్మహత్య

- మెదక్ జిల్లాలో కిష్టాపూర్‌లో ఘటన
- విద్యుదాఘాతంతో మహిళా రైతు, ఎలక్ట్రీషియన్ మృతి

చేగుంట, అడ్డగూడూరు, కోదాడ రూరల్, మార్చి 12: చేతికొచ్చే సమయంలో పంట ఎండిపోకూడదని మూడు బోర్లు వేయించినా చుక్క నీరు రాకపోగా.. అప్పుల పాలవ్వడంతో కలత చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా చేగుంట మండల పరిధి కిష్టాపూర్‌కు చెందిన కుర్మ స్వామి(30) అనే రైతు తన పొలంలోని చెట్టుకు మంగళవారం ఉరి వేసుకుని మరణించాడు. కుర్మ స్వామి తనకున్న నాలుగు ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. పంటను కాపాడుకునేందుకు మూడు బోర్లు వేశారు. బోర్లు వేసేందుకు, పంట సాగుకు సుమారు నాలుగు లక్షల అప్పు చేశారు. నీళ్లు రాక పొలం ఎండిపోగా, అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుర్మ స్వామికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, పొలంలో కింద పడి ఉన్న 11కేవీ త్రీఫేజ్ మెయిన్ వైరును తొక్కి విద్యుదాఘాతానికి గురై యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామానికి చెందిన బోనాల లక్ష్మి(40) అనే మహిళా రైతు ప్రాణాలు కోల్పోయారు. లక్ష్మి రోజు మాదిరిగా మంగళవారం సాయంత్రం పొలంకు వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. ఇక, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన షేక్ జానీమియా(35) అనే ఎలక్ట్రీషియన్ తన ఇంట్లో తెగిన విద్యుత్ తీగకు మర్మమతుల చేస్తూ విద్యుదాఘాతానికి గురై మరణించాడు.

# రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో 4,356 అధ్యాపక పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకం
- నోటిఫికేషన్ జారీ.. 16న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు
- నాణ్యమైన విద్యే లక్ష్యం: మంత్రి దామోదర

| పోస్టులు | ఖాళీల సంఖ్య | వేతనం (రూ.లలో) |
|---|---|---|
| ప్రొఫెసర్ | 498 | 1,90,000 |
| అసోసియేట్ ప్రొఫెసర్ | 786 | 1,50,000 |
| అసిస్టెంట్ ప్రొఫెసర్ | 1459 | 1,25,000 |
| సీనియర్ రెసిడెంట్స్ | 1201 | 92,575 |
| ట్యూటర్స్ | 412 | 55,000 |

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీర్చేందుకు రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. 2021 అక్టోబరు నుంచి ఖాళీగా ఉన్న 4,356 టీచింగ్ పోస్టులను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయాలన్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నం.98 విడుదల చేసింది. ఇందులో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీతో ఏటా సర్కారుపై అదనంగా రూ.634 కోట్ల భారం పడుతుందని మంత్రి తెలిపారు. మెడికల్ కాలేజీల్లోని అధ్యాపకుల నియామకాలన్నీ జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీల ద్వారా సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల బలోపేతం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. జాతీయ వైద్య కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన విద్య అందించడానికి పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. కాగా, కాలేజీల వారీగా పోస్టుల వివరాలను ఆయా కాలేజీల వెబ్‌సైట్లలో పొందుపర్చారు. కాలేజీల వెబ్‌సైట్ల వివరాలు డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో (htpps://dme.telangana.gov.in) ఉన్నాయి. అన్ని కాలేజీల్లో ఈ నెల 16న వాక్-ఇన్-ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అర్హతలున్న అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

# లోక్‌సభ ఎన్నికలకు ఖర్గే దూరం!

- ఒక నియోజకవర్గానికే పరిమితం కాదలుచుకోలేదు: ఏఐసీసీ చీఫ్
- దేశవ్యాప్తంగా దృష్టి పెడతానని వెల్లడి
- గుల్బర్గా నుంచి అల్లుడిని దింపే చాన్స్

న్యూఢిల్లీ, మార్చి 12: ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున ఖర్గే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ ఎన్నికలు అత్యంత కీలకమని, పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. తాను కూడా పోటీ చేస్తే ఒక నియోజకవర్గంపైనే దృష్టి పెట్టి, అక్కడే పరిమితం కావాల్సి ఉంటుందని ఖర్గే అభిప్రాయపడ్డారు. అయితే, పార్టీ వర్గాలు మాత్రం ఆయన పోటీ చేయాలని కోరుకుంటున్నాయి. ఈ ఎన్నికలను వదులుకోకూడదని, పోటీలో ఉండే పార్టీని ముందుండి నడిపించాలని వారు చెబుతున్నారు. కానీ, వీరి వాదనను ఖర్గే తోసిపుచ్చుతున్నారు. "రానున్న ఎన్నికలు అత్యంత కీలకం. పార్టీ చీఫ్‌గా ఒకే నియోజకవర్గానికి పరిమితం కాలేను. దేశవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలపైనా దృష్టిపెట్టాల్సి ఉంది" అని ఖర్గే తెలిపారు. కర్ణాటకలోని గుల్బర్గా నియోజకవర్గం నుంచి ఖర్గేని రంగంలోకి దింపాలని గత వారం జరిగిన సమావేశంలో నేతలు ఏకగ్రీవంగా భావించారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును జాబితాలోనూ చేర్చారు. అయితే, ఖర్గే పోటీకి దూరంగా ఉండి, ఈసారి తన అల్లుడు రాధాకృష్ణన్ దొడ్డమానిని బరిలో నిలపాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. గుల్బర్గా నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు విజయం సాధించిన ఖర్గే 2019 ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పెద్దల సభలో విపక్ష నాయకుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. మరో నాలుగేళ్లు ఆయన పదవీ కాలం ఉంది. ప్రస్తుతం ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే సిద్ధరామయ్య మంత్రి వర్గంలో కేబినెట్ మంత్రిగా ఉన్నారు. తొలుత ప్రియాంక్‌ను పార్లమెంటు బరిలో నిలపాలని అనుకున్నా.. తర్వాత ఈ నిర్ణయాన్ని పార్టీ వెనక్కి తీసుకుంది. ఇదిలా వుంటే, ఖర్గే కనుక పోటీ చేయకపోతే, ఏఐసీసీ అధ్యక్షులుగా ఉండి ఎన్నికలకు దూరంగా ఉన్న వారిలో ఈయనే తొలి నాయకుడు అవుతారు.

# రైతన్న సమయస్ఫూర్తి

**దెబ్బతిన్న మిర్చి పంటను తీసేసి యాసంగిలో పత్తి సాగు**

కాటారం, మార్చి 12: మిర్చి పంట తెగుళ్ల బారిన పడింది. దీంతో ఆ రైతన్నకు తీరని నష్టం వాటిల్లింది. అయినా అతడు దిగులు చెందలేదు. ఇలా ఎందుకైందని మదన పడుతూ కూర్చోలేదు. ప్రత్నామ్నాయ మార్గాన్ని అన్వేషించాడు. యాసంగిలో పత్తి పంట గురించి ఎక్కడో విన్నట్టు గుర్తుకొచ్చింది అతడికి. వెంటనే వ్యవసాయ అధికారి సలహా తీసుకొని ఇదే భూమిలో యాసంగి పంటగా పత్తిని వేశాడు. అదిప్పుడు ఏపుగా పెరగగా యాసంగి పంటపై ఆ రైతన్న ఆశలు చిగురించాయి.

కాటారం మండలంలోని ధన్వాడకు చెందిన మారగోని జగదీశ్ శంకరంపల్లి శివారులో రెండున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. వానాకాలం పంటగా మిర్చి సాగు చేశాడు. అయితే.. పలు రకాల తెగుళ్లతో మిర్చి పంట పూర్తిగా దెబ్బతింది. దీంతో అతడు దాన్ని తీసేసి డిసెంబరులో యాసంగి పత్తి పంట సాగు చేశాడు. మిర్చి కోసం దున్నిన దుక్కిలోనే పత్తి విత్తనాలు నాటాడు. పంట ఎదిగేందుకు ఎరువులు వేశాడు. దీంతో వానాకాలంలోలాగే పత్తి విరివిగా ఎదిగి పూత, కాత వచ్చింది. తోటి రైతులు ఇది చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు జగదీశ్ సమయస్ఫూర్తిని అభినందిస్తున్నారు. దీనిపై ఏవో గిరి రామకృష్ణ మాట్లాడుతూ యాసంగి పంటగా పత్తి సాగు చేయడం అరుదైన విషయమన్నారు. ధైర్యంగా మిర్చిని ధ్వంసం చేసి పత్తిని సాగు చేసిన జగదీశ్ పెట్టుబడులు తక్కువగానే పెట్టి ప్రయోజనం పొందాడన్నారు. రెండున్నర ఎకరాల చేనులో సుమారు 20 క్వింటాళ్లకు పైగా పత్తి దిగుబడి రావచ్చని రైతు జగదీశ్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు.



దెబ్బతిన్న మిర్చి పంటను తీసేసి యాసంగిలో పత్తి సాగు

# పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్**

**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యంత్రాంగానికి మార్గనిర్దేశం**

భూపాలపల్లి కలెక్టరేట్/ములుగు కలెక్టరేట్, మార్చి 12: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. అదనపు సీఈవోలు లోకేష్ కుమార్, సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి హైదారాబాద్ నుంచి మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూపాలపల్లిలో కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టరేట్ వెంకటేశ్వర్లు, ములుగులో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ ఏర్పాట్లు, ఈవీఎంలు, నామినేషన్ల ప్రక్రియ తదితర అంశాలతో కూడిన ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలను సమకూర్చాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశపు మినట్స్ కాపీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. నూతన ఓటర్లకు ఓటరు గుర్తింపుకార్డులు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నూతనంగా మంజూరు చేసిన ఓటరుకార్డు వివరాలను సంబంధిత ప్రింటర్లకు అందజేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన మేర పోలింగ్ సిబ్బందిని సన్నద్ధం చేసి శిక్షణ అందించేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. ఇంటివద్ద ఓటుహక్కు వినియోగించుకునేందుకు భారత ఎన్నికల కమిషన్ 85సంవత్సరాలకుపైగా వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించిందని, ఇందుకోసం ప్రత్యేకంగా ఓటర్లు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని అన్నారు. దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు ఇంటివద్ద ఓటుహక్కు కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అదేవిధంగా ప్రతి పోలింగ్‌కేంద్రం పరిధిలో దివ్యాంగులను మ్యాపింగ్ చేసి పోలింగ్‌రోజున వారికి అవసరమైన రవాణా సౌకర్యాన్ని కల్పించాలని, నామినేషన్ దాఖలు ఏర్పాట్లు పక్కాగా చేసుకోవాలని అన్నారు. ఎన్నికల్లో పోలింగ్ టర్న్‌ఔట్ పెరిగేవిధంగా విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని, జిల్లాలో ఉన్న విద్యాసంస్థల్లో ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్బులు ప్రారంభించి ఓటు ప్రాముఖ్యతపై వివరించాలని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలు వినూత్నంగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఓటరు అవగాహన కార్యక్రమాల గురించి ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల్లో, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాల్లో ప్రచారం కల్పించాలని అన్నారు. ఈకార్యక్రమంలో భూపాలపల్లి ఆర్డీవో మంగీలాల్, డీపీఆర్వో శ్రీనివాస్, ములుగు ఆర్డీవో కె.సత్యపాల్‌రెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, తహసీల్దార్ విజయభాస్కర్, ఎన్నికల సెల్ డీటీలు అనిస్‌ఫాతిమా, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జిగా ప్రదీప్



భూపాలపల్లిటౌన్, మార్చి 12: కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జిగా జోడు ప్రదీప్‌ను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్ మన్నె సతీష్ మంగళవారం ప్రకటించారు. తనను నియమించినందుకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డికి ప్రదీప్ కృతజ్ఞతలు తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేపట్టాలని వినతి

వెంకటాపురం(నూగూరు), మార్చి 12: మండలంలోని రామచంద్రాపురం పంచాయతీలో అక్రమంగా తీర్మానాలు చేసి అవినీతికి ప్రోత్సహించిన పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేపట్టాలని గ్రామస్థులు మంగళవారం తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి కోసం ఇసుక ర్యాంపుల్లో లారీల నుంచి రూ.1000 చొప్పున వసూలు చేసిన సొమ్ము రూ.10 లక్షలను పంచాయతీకి కాకుండా పంచాయతీ ట్రాక్టర్, సిబ్బంది జీతాలకు ఖర్చుపెట్టామని చెబుతూ కార్యదర్శి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. పంచాయతీ నిర్వహణ కోసం ప్రభుత్వం నుంచి వచ్చిన నిధుల వివరాలు సైతం గ్రామసభలో తెలియజేయడం లేదని అన్నారు. ఈవిషయమై ఉన్నతాధికారులు పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేపట్టిన తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# యథేచ్ఛగా చౌర్యం!

(5వ పేజీ తరువాయి)

పోలీసు, సింగరేణి సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం అందిస్తారని, దీనివల్ల దొంగతనం జరుగుతున్నప్పుడు పోలీసులు ఆ ప్రాంతాల వైపు కన్నెత్తికూడా చూడరని స్థానికులు చెబుతున్నారు. దీంతో సగటున రోజుకు కనీసం రెండు, మూడు లారీలైనా అపహరణకు గురవుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ ప్రాంతంలో బొగ్గు చౌర్యం కొత్త కాకపోయినా ఝార్ఖండ్ తరహాలో మాఫియా ముఠా సంస్కృతి పెరుగుతోందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఝార్ఖండ్‌లోని బొగ్గు గనులు రాజకీయ నేతల కనుసన్నల్లోనే పనిచేస్తాయి. అక్కడ వాస్తవిక ఉత్పత్తిలో దాదాపు 35 శాతం బొగ్గును ఈ మాఫియా తస్కరించి సొమ్ము చేసుకుంటోంది. గనులన్నీ మారుమూల ప్రాంతాల్లో ఉండటం, నక్సల్ సమస్య అధికంగా ఉండటం లాంటి అంశాల నేపథ్యంలో అక్కడ నియంత్రణ లేదని చెబుతున్నారు. అక్కడి ప్రభుత్వం బొగ్గు మాఫియా ముఠాలపై చర్యలు తీసుకోలేకపోతోందని, దీంతో దశాబ్ద కాలంగా చిన్నచిన్న దొంగతనాలతో కార్యకలాపాలు నెరిపిన ముఠాలు ఆయుధాలు సంపాదించి సమాంతర వ్యవస్థనే నడుపుతున్నాయని సమాచారం. తాజాగా ఈ ప్రాంతంలోనూ అదే తరహా కోల్ స్మగ్లింగ్ ముఠాల సంస్కృతి పెరుగుతుండడం ఆందోళన కలిగించే విషయమేనని అంటున్నారు. ఇకపోతే ఇటీవల కాలంలో బొగ్గును తస్కరించే క్రమంలో కూలీలు ప్రమాదవశాత్తు రైలు కిందపడి మరణిస్తున్న సంఘటనలు తరచుగా జరుగుతున్నాయంటున్నారు. అంతేకాదు బొగ్గును తస్కరిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అవయవాలు కోల్పోయి జీవచ్ఛవాలుగా బతుకులీడుస్తున్న కూలీలు రామగుండం ప్రాంతంలో చాలా మందే కనిపిస్తారు.

**ఏడాదికి సగటున 150కి పైగా బొగ్గు తస్కరణ కేసులు**

సింగరేణి సంస్థ పరిధిలోని కొత్తగూడెం, ఇల్లెందు, భూపాలపల్లి రామగుండం, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి (గోలేటి) ప్రాంతాల్లో గతేడి కాలంలో దాదాపు 150కి పైగా బొగ్గు తస్కరణ కేసులు నమోదైనట్టు తెలుస్తోంది. అంటే.. ఒక్కో ఏరియాలో సగటున నెలకు 10కి తక్కువ కాకుండా కేసులు నమోదవుతున్నాయని అంచనా. అయితే ఇవన్నీ కూడా చిన్నచిన్న కేసులేనని సంస్థకు చెందిన విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. బొగ్గు తస్కరణ కేసులు ఎక్కువగా భూపాలపల్లి, బెల్లంపల్లి, రామగుండం, ఎన్టీపీసీ ప్రాంతాల్లోనే జరుగుతున్నట్లు తెలుస్తోంది.

సగటున ఒక ఏడాదికి ఒక్కో ఏరియాలో రూ.10 కోట్ల విలువైన బొగ్గు స్మగ్లర్ల బారిన పడుతున్నట్టు చెబుతున్నారు. ఇటీవల భూపాలపల్లి ఓసీపీ 1 నుంచి రామగుండం ఆర్‌జీ- 3కి తరలిస్తుండగా స్మగ్లర్లు అత్యంత చాకచక్యంగా వాహనాలకున్న జీపీఎస్ ట్రాకర్లను మార్చి లారీల్లోని సగం బొగ్గును ఇటుక బట్టీలు, రహస్య ప్రాంతాల్లో డంపు చేసినట్లు విజిలెన్స్ గుర్తించింది. పక్కా సమాచారంతో జరిపిన దాడుల్లో ఒక ఇటుక బట్టీలోనే దాదాపు 200 టన్నుల బొగ్గు నిల్వలను కనుగొనడం ఈ ప్రాంతంలో జరుగుతున్న బొగ్గు స్మగ్లింగ్ దందాకు నిదర్శనం. ఇప్పటి వరకు కేవలం 227 కేసులే నమోదైనట్టు సింగరేణి విజిలెన్స్ అధికారులు చెబుతున్నా ఎంతమందిపై చర్యలు తీసుకున్నారు.. ఎంత బొగ్గు పట్టుబడింది? అన్న ప్రశ్నలకు మాత్రం అధికారుల నుంచి సమాధానం కరువైంది. ఇదే విషయమై జీఎం విజిలెన్స్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

## కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడిగా రజినీకాంత్

చిట్యాల, మార్చి 12: కళాకారుల ఐక్య వేదిక మండల అధ్యక్షుడిగా సీఆర్‌పల్లి గ్రామానికి చెందిన గూడెపు రజినీకాంత్‌ను ఎన్నుకున్నారు. మండల కళాకారుల సమావేశం మంగళవారం మండల కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సాంస్కృతిక కార్యదర్శి జన్నె యుగేందర్ ఈ మేరకు ప్రకటించారు. ఈ సమావేశంలో దాసారపు నరేష్, మ్యాదరి సునీల్, బానోత్ రాజు నాయక్, పుల్ల ప్రతాప్, శంకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కమలం గూటికి అరూరి

(5వ పేజీ తరువాయి)

పోటీ చేస్తే, ఫలితాల అనంతరం ఆయనతో స్టేషన్‌ఘనపూర్‌కు రాజీనామా చేయించి.. ఆ తర్వాత జరిగే ఉప ఎన్నికల్లో ఆయన కుమార్తె కడియం కావ్యకు టికెట్ ఇస్తామని కూడా కాంగ్రెస్ నుంచి ఆఫర్లు వస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై కడియం శ్రీహరితో నేరుగా చర్చలు జరపాలని కాంగ్రెస్ నేతలు నిర్ణయించినట్టు సమాచారం. కాంగ్రెస్ రెండో జాబితా బుధవారం రాత్రి లేదంటే గురువారం వెలువడే అవకాశం ఉంది. కడియం నుంచి అనుకూల స్పందన వస్తే మూడో జాబితా వరకు వరంగల్ సీటుపై పెండింగ్ పెట్టాలని కూడా కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఆదేశాలు వచ్చినట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే నిత్యం కాంగ్రెస్‌పై నిప్పులు చెరుగుతున్న కడియం శ్రీహరి పార్టీ మారుతారా? అనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.

**హస్తం వైపు మేయర్ చూపు**

ఇప్పటికే గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌కు చెందిన కార్పొరేటర్లు పలువురు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అయితే వీరితో పాటే హస్తం గూటికి చేరేందుకు ప్రయత్నించి మేయర్ గుండు సుధారాణి రాకను జిల్లాకు చెందిన ఓ మంత్రితో పాటు పలువురు కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు అడ్డుకున్నట్లుగా ప్రచారం జరిగింది. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేయర్ చేరికపై అభ్యంతరం చెప్పుతున్న నేతలతో మాట్లాడి ఒప్పించినట్లుగా తెలిసింది. దీంతో త్వరలోనే మేయర్ గుండు సుధారాణి కాంగ్రెస్ గూటికి చేరుతారనే ప్రచారం జరుగుతోంది. మొత్తానికి బీఆర్ఎస్‌లోని కీలక నేతలు పార్టీ మారుతుండటంపై ఓరుగల్లులో హాట్‌హాట్‌గా రాజకీయాలు మారుతున్నాయి.

## బాలల హక్కులు కాపాడాలి

**డీసీపీయూ కౌన్సిలర్ శైలజ**

భూపాలపల్లి టౌన్, మార్చి 12: బాలల హక్కులను కాపాడాలని డీసీపీయూ కౌన్సిలర్ శైలజ అన్నారు. మంగళవారం భూపాలపల్లి మండ లంలోని కొత్తపల్లిలో పోషణ పక్వాడా కార్యాక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాలలక ఎలాంటి సమస్య వచ్చినా చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలన్నారు. బాలల కు చదువతోపాటు విలువలు నేర్పాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ లైన్ కేస్ వర్కర్ మండల ఇన్‌చార్జి కళావతి, సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ టీచర్లు విలాసరాణి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం, ఎమ్మెల్యే ఫొటోలు పెట్టాలి

మొగుళ్లపల్లి, మార్చి 12: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఫొటోలు పెట్టాలని పీడిసిల్ల, మొగుళ్లపల్లి ఎంపీటీసీలు దండ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎర్రబెల్లి వనిత పున్నంచందర్, కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం వారు మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో అన్ని ప్రభుత్వశాఖల్లో సీఎంతోపాటు ఎమ్మెల్యే ఫొటోలు ఏర్పాటు చేశారని కాగా, నూతన ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు గడిచినప్పటికీ అధికారులు గౌరవంగా ప్రభుత్వ కార్యాలయాలు, గురుకులాలు,వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో సీఎంతోపాటు ఎమ్మెల్యే ఫొటోలు ఏర్పాటు చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. తక్షణమే అధికారులు స్పందించి అన్ని ప్రభుత్వ శాఖల్లో సీఎం, ఎమ్మెల్యే ఫొటోలు ఏర్పాటు చేయాలని అన్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చిట్యాల, మార్చి 12: మండలంలోని కాల్వపల్లి శివారుమానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సీఐ మల్లేష్ తెలిపారు. మండలంలోని అందుకు తండా చైన్‌పాక, వెంచరామి శివారుల్లో మంగళవారం వాహన తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈక్రమంలో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి పత్రాలు లభించలేదన్నారు. దీంతో ట్రాక్టర్ల డ్రైవర్లు, యాజమానులు అందుకుతండాకు చెందిన అజ్మీరా నందునాయక్, భూపాలపల్లి మండలం నేరేడేపల్లి, వజినాపల్లికి చెందిన మేకల స్టాలిన్, తాళ్లపెల్లి స్వామి, భీముని మహేందర్, దానవేని మహేందర్, బండి కిరణ్, విష్ణు, గట్టు శ్రావణ్, జంగిటి కార్తిక్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. తనిఖీలో ఏఎస్సై ఈశ్వరయ్య, సిబ్బంది యాకయ్య, రవి, శ్రీధర్, సిద్ధార్థ, నవీన్, అస్లం జానీ, లింగన్న పాల్గొన్నారు.



సీజ్ చేసిన ఇసుక ట్రాక్లతో సీఐ మల్లేష్, సిబ్బంది

## బాధ్యతలు స్వీకరించిన పస్రా ఎస్సై

గోవింద రావు పేట, మార్చి 12: మండలంలోని పస్రా నూతన ఎస్సైగా అచ్చ కమలాకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌లో, ములుగు డీసీఆర్‌బీలో విధులు నిర్వర్తించారు. ఇక్కడ ఇంతకుముందు పని చేసిన ఎస్సై షేక్‌మస్తాన్ బదిలీ ఇటీవల కాగా ఆయన స్థానంలో కమలాకర్ విధుల్లో చేరారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై కమలాకర్

## దివ్యాంగుడికి ట్రైసైకిల్ పంపిణీ

వెంకటాపురం(నూగూరు), మార్చి 12: మండలకేంద్రంలోని ఎస్సీమర్రిగూడెంకు చెందిన దివ్యాంగుడు కోయిల అఖిల్‌కు చేయూత స్వచ్ఛంద సేవాసంస్థ ట్రైసైకిల్‌ను సమకూర్చగా మంగళవారంజడ్పీటీసీ పాయం రమణ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో శిరీష, స్వచ్ఛందసంస్థ అధ్యక్షుడు చిడెం సాయిప్రకాష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రమాదేవి, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

## సేవాగుణం కలిగి ఉండాలి

మహదేవపూర్, మార్చి 12: సమాజంలోని ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని కలిగి ఉండాలని, విద్యార్థి దశ నుంచే దీన్ని అలవర్చుకోవాలని మహదేవపూర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని సూరారం గ్రామంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సేవా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు పలు సూచలను చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ప్రసాద్, డీఎల్‌పీవో వీరభద్రయ్య, ఎంపీటీసీ తిరుమల, సూరారం హైస్కూల్ హెడ్మాస్టర్ పురుషోత్తం రెడ్డి, ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ ఎర్రయ్య, కార్యదర్శి అంజలి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోడుభూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి

వెంకటాపురం(నూగూరు), మార్చి 12: ఏజెన్సీలో ఆదివాసీల సాగులో ఉన్న పోడుభూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలపరిధిలోని బెస్తగూడెం కొమరంభీంనగర్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివాసీలు పోరాడి సాధించుకున్న అటవీహక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు అధికారులు కుట్రలు చేస్తున్నారని, పోడుభూములను లాక్కోవాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గిరిజనేతరుల కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు కణితి వెంకటకృష్ణ, పూనెం ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మడిదొడ్డిలో డీఎంహెచ్‌వో పర్యటన

వాజేడు, మార్చి 12: మండలంలోని గుమ్మడిదొడ్డి విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) అప్పయ్య మంగళవారం ఆ గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. జ్వరాలు, కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు, వాపులతో బాధపడుతున్న వారితో మాట్లాడారు. అనంతరం వాజేడు పీహెచ్‌సీలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 70 మందిని ఇప్పటి వరకు జ్వరాలతో బాధపడగా 64 మంది రికవరీ అయినట్లు తెలిపారు. గుమ్మడిదొడ్డిలో నలుగురు, ఇప్పగూడెంలో నలుగురు మాత్రమే ప్రస్తుతం జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించామన్నారు. కీళ్లనొప్పులు, మోకాళ్లనొప్పులకు సంబంధించి వైరల్ ఆర్థరైటీస్‌గా నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు టీహబ్ డయగ్నాస్టిక్ సెంటర్ ద్వారా వారికి అన్ని రకాల వైద్యపరీక్షలు చేపట్టినట్టు చెప్పారు. అన్నింట్లో సాధారణ ఫలితాలే వచ్చినట్లు తెలిపారు. అంటు వ్యాధుల్లా జ్వరాలు ప్రబలతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరం అని గుర్తిస్తే హోం ఐసోలేషన్, భౌతిక దూరం పాటిస్తూ చికిత్సలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీపీ స్పెషల్ ఆఫీసర్ తహసీల్దార్ శ్రీనివాస్, వైద్యాధికారులు అభినయ్, మహేందర్, రాహీల్, హెచ్ఎస్ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 19, 26 తేదీల్లో జిల్లా ఆస్పత్రిలో సదరం క్యాంపులు

ములుగు కలెక్టరేట్, మార్చి 12: జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో ఈనెల 19,26 తేదీల్లో సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 19న శారీరక వికలాంగులు, వినికిడి లోపం, మూగవారికి, 26న శారీరక వికలాంగులు, కంటిచూపు లోపం కలిగిన వారికి సదరం క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లాలోని అర్హులైన వారు సమీపంలోని మీసేవ కేంద్రాల్లో రూ.35 చెల్లించి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని, వారు ఇచ్చిన రశీదు, సంబంధిత వైద్యపరీక్షల రిపోర్టులతో ఉదయం 10 గంటలకు క్యాంపుల్లో పాల్గొనాలని సూచించారు.

## సింగరేణిలో బదిలీలు

కాకతీయఖని, మార్చి 12: భూపాలపల్లి ఏరియా సింగరేణిలో బదిలీలు జరిగాయి. ప్రస్తుతం ఇక్కడ జీఎంగా పనిచేస్తున్న శ్రీనివాసరావు ఏప్రిల్ 30న ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఆయన స్థానంలో హబీబ్ హుస్సేన్ బాధ్యతలు చేపడతారు. ఈ క్రమంలో హబీబ్‌హుస్సేన్ యాజమాన్యం ప్రస్తుతం ఇక్కడ ఓఎస్‌డీగా నియమించింది. ఎస్‌వో టు జీఎం వెంకటయ్యను జీఎం(ఎస్టేట్) కార్పొరేట్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఏరియాలో క్వాలిటీ డీజీఎంగా విధులు నిర్వహిస్తున్న శీలం కవీంద్రను ఎస్‌వోటుజీఎంగా నియమించారు. కేటీకే-8వ గని ఏజెంట్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరావును ఆర్జీ-2 ఎస్‌వో టు జీఎంగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఓపెన్‌కాస్ట్-2 గని మేనేజర్ వాసం భిక్షమయ్యను కేటీకే-8వ గ్రూప్ ఏజెంట్‌గా యాజమాన్యం నియమించింది. ఏరియా ఎన్విరాన్‌మెంట్ సెల్‌లో పనిచేస్తున్న కృష్ణప్రసాద్‌ను ఓసీ-2 గని మేనేజర్‌గా నియమించారు. కృష్ణప్రసాద్ స్థానంలో ఎన్విరాన్‌మెంట్(కార్పొరేట్)లో అడిషనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న పోషమల్లును భూపాలపల్లి ఏరియా ఎన్విరాన్‌మెంట్ సెల్‌కు బదిలీ చేశారు.

## మహిళలకు వైద్య పరీక్షలు

వెంకటాపురం(నూగూరు), మార్చి 12: మండలకేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ మంగళవారం 72మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈసందర్భంగా 18మంది నుంచి రక్తనమూనాలు సేకరించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## జడ్పీహెచ్‌ఎస్‌లో మాక్ పోలింగ్

మొగుళ్లపల్లి, మార్చి 12: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు విజయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి తరగతి నుంచి క్లాస్‌లీడర్, మొత్తం పాఠశాలకు ఒక స్కూల్ లీడర్ ఎన్నిక కోసం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈప్రక్రియలో ఆరో తరగతి నుంచి బండారి అన్వేష్, ఏడో తరగతి నుంచి సంజయ్, ఎనిమిదో తరగతి నుంచి ఐశ్వర్య, తొమ్మిదో తరగతి నుంచి నక్షత్ర స్కూల్ లీడర్‌గా పోటీపడగా బండారి అన్వేష్ గెలుపొందాడు. దీంతో ప్రధానోపాధ్యాయుడు విజయపాల్‌రెడ్డి వారిని అభినంచారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, సురేందర్, కళ్యాణి, అనిల్‌కుమార్, రాజు, కుమారస్వామి, ప్రవీణ్, లలిత, విజిత, శ్రీకళ, స్పందన, చందర్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు సంత నిర్వహణకు వేలం

టేకుమట్ల, మార్చి 12: మండల కేంద్రంలో ప్రతి బుధవారం జరగే వారాంత సంతకు గురువారం వేలంపాట నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ శైలజ, పంచాయతీ కార్యదర్శి సాంబశివుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు ఇంటిపన్ను రశీదు, రూ. 10 వేల డిపాజిట్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో హాజరుకావాలని గ్రామ పంచాయతీ కార్యాలయానికి హాజరు కావాలని సూచించారు.

## కొండాయిలో వైద్య శిబిరం

ఏటూరునాగారం, మార్చి 12 : ఏటూరునాగారం మండలం కొండాయి, మల్యాల గ్రామాలల్లో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. కొండాయి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హెచ్.ప్రణీత్ కుమార్ ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటు చేశారు. ప్రజలకు వివిధ పలు రకాల రక్త పరీక్షలు చేశారు. జ్వరాల బారిన పడకుండా ఈ చర్యలు చేపట్టామని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ సతీష్, హెల్త్ అసిస్టెంట్ కె. భాస్కర్‌తో పాటు వైద్య శిబిరంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన పీవో

మంగపేట, మార్చి 12: మండలంలోని చుంచుపల్లి బాలికల గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ ఉన్నత పాఠశాలను, బ్రాహ్మణపల్లి బాలుర గిరిజన సంక్షేమశాఖ ఉన్నత పాఠశాలను ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చిత్రామిశ్రా మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. మరుగుదొడ్లల్లో సరైన నీటి సౌకర్యం ఉండాలని, బాలికల హాస్టల్‌లోని టాయిలెట్స్ వద్ద డస్ట్‌బిన్లు తప్పని ఉంచాలని అన్నారు. అన్ని గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో శిథిలావస్థలో ఉన్న భవనాలు, పాత ఓవర్ హెడ్‌ట్యాంక్‌ల గురించి పీవో దృష్టికి ప్రధానోపాధ్యాయులు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆమె స్పందిస్త సంబంధిత డీఈలు, డీటీడీవోలకు వాటిపై నివేదికలు సమర్పించాలని సూచించారు. వంటగది, మరుగుదొడ్లు, డార్మీటరి, తరగతి గదుల పరిశుభ్రతను ప్రధానోపాధ్యాయులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఐటీడీఏ పరిధిలో గల అన్ని ఏహెచ్ఎస్‌లు తప్పని సరిగా సౌకర్యాలపై దృష్టి పెట్టాలని అన్నారు. ఆమె వెంట డీడీ పోచం తదితరులు ఉన్నారు.



చుంచుపల్లి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో